

# 12

## డా॥ దేవరాజు మహారాజు

మెలకువ వచ్చింది. తెల్లవారిందని గ్రహించాను. లేచి కూచున్నాను. 'చచ్చినట్లు నిద్రపోవడం. అప్పుడే పుట్టినట్టు మేల్కోవడం.... రోజూ ఇదంతా ఏమిటో' విచిత్రంగా తోచింది.

లేచి నిలబడి, నిలువుటద్దం ముందుకు నడిచాను. ప్రతిబింబం కనిపించింది. అసలీ అద్దాన్ని కనుక్కోవడం ఎంత గొప్ప విషయం? ఇది లేకపోతే మనిషికి తన ఆకారం తనకు తెలిసేది కాదు కదా ? తనకు తాను తెలుసుకోవడమన్నమాట ! బాహ్య అంతర ప్రపంచాలలో మనిషి తన్ను తాను తెలుసుకోవడమంటే సామాన్యమైన విషయమా....? అబ్బో పొద్దున్నే గొప్ప వేదాంతంలో పడ్డానే - అని నవ్వుకుని చుట్టూ చూశాను. మంచం, పరుపు, దిండు, ఏ.సి., లైట్, కార్పెట్, కర్టెన్ వంటి వెన్నో కనిపించాయి. ఆలోచిస్తే ఒక్కొక్కటీ ఒక్కొక్క సుఖం ! 'ఈ ఆధునిక జీవనశైలిని సాధించడానికి మనిషి ఎంతదూరం ప్రయాణించి వచ్చాడు ?' అని ఆలోచించాను ఓ క్షణం.

తలెత్తి చూశాను. ఎదురుగా కిటికీ కనిపించింది. ఇల్లు ఒక అద్భుతమైతే, కిటికీ పరమాద్భుతం ! అది తెరిస్తే కన్ను తెరిచినట్టు ప్రపంచమంతా కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. కిటికీ దగ్గరికి వెళ్ళి, కిందికి చూశాను. ఎక్కడో కింద

# శుభోదయం



వందమీటర్ల లోతులో రోడ్డు కనిపిస్తోంది. అంటే మన నివాసం భూమికి ఇంత ఎత్తులో నన్నమాట ? రోడ్డు పొడవునా టెలిఫోన్ వైర్లు, ఎలక్ట్రిక్ వైర్లూ.... అప్పుడప్పుడే తిరగడం ప్రారంభించిన పాలవ్యాను. ఫ్యాక్టరీ పనికి వెళుతున్న వర్కర్లు.... పేపర్ కుర్రాళ్లు, ఎర్లీ ట్రెయిన్ అందుకోవడానికి పరుగులు పెడుతున్న ప్యాసింజర్స్, పొగమంచు.... నేపథ్యంగా రూపుదిద్దుకున్న ఒక ఆధునిక ప్రకృతి తైలవర్ణ చిత్రంలో కదలాడుతున్న మానవాకారాలుగా ఉన్నారు.

దిగడానికి వేగం తగ్గించుకుంది ఆకాశంలో విమానం. ఉదయించబోతున్న సూర్యుడు, రంగులు మార్చుకుంటున్న మేఘాలు, వాటికి పోటీగా ఫ్యాక్టరీ వదిలే పొగలు. ఏది చూసినా, ఎటువైపు చూసినా ప్రతి అంశంలో నాకు మనిషే కనిపిస్తున్నాడు. ప్రపంచం మైనస్ మనిషి ఎలాగుండేది? ఆలోచిస్తే తమాషాగా ఉంటుంది.

బ్రష్ చేసుకుందామని బాత్‌రూంలోకెళ్ళాను. శరీరాన్ని శుభ్రంగా, నాజూకుగా, ఆధునికంగా ఉంచుకోవడానికి ఎన్ని సౌకర్యాలు? ఎక్కడో ఉండే నీరు, ఇష్టమైన చోటికి, ఇష్టమైన రీతిలో వచ్చి సేవ చేయడం భలేగా ఉంది. ఆలోచిస్తూ గీజర్ వేడి చేసిన నీళ్ళతో ఒకేసారి సుఖంగా స్నానం కూడా చేసి గదిలోకొచ్చాను. కమ్మటి కాఫీ వాసన వచ్చింది. గ్యాస్‌స్టౌ మీద తయారయ్యే కాఫీలో, కాఫీ పండిందెక్కడ? పాలు పితికిందెక్కడ? చక్కెర తయారయ్యిందెక్కడ? వీటి కలయికను సాధించి అనుభవించాలని తెలుసుకున్నదెవరు?

అలాగే ఎక్కడెక్కడి నుండో కలిసిపోయే మానవ సంబంధాల తీయదనం, వెచ్చదనం ఎంత విలువైనవి? ఆ సంబంధాలే ప్రగతికి సోపానాలు.

శ్రీమతి వేడి కాఫీ అందించింది. తనూ ఓ కప్పు తెచ్చుకుంది. పొద్దున్నే అలా బాల్కనీలో గార్డెన్ చెయిర్స్‌లో కూచుని కాఫీ తాగందే రోజు ముందుకు జరగదు. భార్యలు, భర్తలు వారి అన్యోన్యతలు, పిల్లలు.... ప్రేమలు, బంధాలు ఎన్ని వేల సంవత్సరాలు దాటి వస్తే, ఇవన్నీ సమకూరాయి? ఈ అనుబంధాల్ని మాటల్లోకి అనువదించడం ఎలా? ప్రయత్నించడం ఒక విధంగా సాహసమని పించింది. కానీ మనిషి చేయని సాహసకార్యమేదీ? వైజ్ఞానిక సాహిత్య సాగర మథనం చేస్తేనే అమృతం లభించేది. 'శుభోదయ'మని పలికిన ఆలిండియారేడియో షహనాయి వినిపిస్తోంది. మనిషి ఎక్కగలిగిన ఎవరెస్ట్ శిఖరాన్ని కొలవొచ్చు. సంగీత శిఖరాల్ని ఎలా కొలుస్తావ్? అనుభూతి ఏ డిజిటల్ కెలోరీ మీటర్ చూపదే - మనిషి సృష్టించుకున్న ఒక ప్రత్యేకమైన ప్రపంచం అది.

వరండాలో పడ్డ వార్తా పత్రిక ప్రపంచాన్ని అక్షరాల్లో బిగించి తెచ్చింది. రాజకీయాలు, ఖూనీలు, హత్యలు, ఎన్‌కౌంటర్లు, వినోదాలు, కాలక్షేపాలు, మంచీ చెడు మాత్రమే కాదు,. పేపర్ తయారీ, ఆఫ్‌సెట్ ప్రింటింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ సెట్టింగ్, ఫ్యాక్స్ వంటి వైజ్ఞానికవిజయాల్నికూడా మోసుకొస్తున్నట్లుంది.

కాఫీ తాగుతూ, దినపత్రిక తిరగేస్తూ ఉంటే... ఎక్కడో విదేశంలో మారుమూల పట్టణంలో నుండి మిత్రుడి ఫోన్‌కాల్ వచ్చింది. నా సెల్‌స్క్రీన్ మీద అతన్ని చూడగానే నాకు అంతు పట్టలేనంత ఆనందం కలిగింది. మానవుడికి హద్దులేమిటి? ఎల్లలేమిటీ? అనిగొప్ప ఆత్మస్థయిర్యంతో పొంగిపోతున్న దశలో మిత్రుడి చల్లని కబుర్లు నన్ను మంత్రముగ్దుణ్ణి చేశాయి. నేనడిగిన ముఖ్యమైన రీసెర్చ్ పేపర్స్ నాకు ఈ-మెయిల్ చేశాడట. లాప్‌టాప్ ఓపెన్ చేసి చూసుకోవాలి. సెల్ ఆఫ్ చేశాను.

మరుక్షణమే ఎదురుగా శాటిలైట్ కనెక్షన్‌తో పనిచేసే ప్లాస్మా టీవీ తెరమీద ఏదో పెద్ద శబ్దం !! అదాటున ఏమిటని లోనికెళ్ళి చూశాను. మా చిన్నోడు రిమోట్ కంట్రోల్‌తో టెలివిజన్ ఆన్ చేశాడు. వాడికి ఐదేళ్ళు సరిగాలేవు. ప్రపంచ పరిజ్ఞానంలో ఏ పరీక్షకైనా, ఏ క్షణమైనా సిద్ధపడతాడు. వైరల్ ఫీవర్‌తో బాధపడి నీరసించి ఉన్నాడు. ఈ మధ్యే మళ్ళీ పుంజుకుంటున్నాడు. వెళ్ళి దగ్గిరగా కూర్చున్నాను.

ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగింది. నేను మా డొమిస్టిక్ రొబోట్ ఆపరేట్ చేశాను. రొబోట్ కదిలింది. బయట ఫెదరిక్, మధ్వాచారి కలిసి వచ్చారని స్క్రీన్‌మీద మెసేజ్ చూపించింది రొబోట్.

వాళ్ళిద్దరూ ఎలా కలిసి వచ్చారో నాకు అర్థం కాలేదు. వాళ్ళిద్దరికీ పరిచయం లేదు. ఫెదరిక్ ఇన్సూరెన్స్ అడ్వయిజర్, మధ్వాచారి చురుకైన కుర్రవాడు. మంచి మాటకారి. వారితో కొద్దిసేపు మాట్లాడితే తెలిసింది. ఇద్దరూ నా దగ్గరికి వస్తూ, అనుకోకుండా లిఫ్ట్‌లో కలిశారుట. పరిచయం చేసుకున్నారట.నవ్వుకుంటూ వచ్చారు. అరగంట కూడా కూర్చోలేదు. నేను మధ్యవర్తిగా ఓ ప్రాజెక్ట్ కలిసి చేయాలని నిర్ణయించేసుకున్నారు కూడా ?

ఏమిటో జీవితంలో ఇంత వేగమా ? అనుకున్నాను. మిత్రులిద్దరినీ పంపించి ఇంట్లోకి వచ్చాను.

కదులుతున్న గడియారం ముళ్ళలా మా పాప, శ్రీమతి చకా చకా తయారవుతున్నారు. నాకంటే ముందు ఉద్యోగానికి వెళ్ళే శ్రీమతి బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేసి డైనింగ్ టేబుల్ మీద పెట్టింది. "నేను సాయంత్రం రావడం లేట్ కావచ్చు. బాబూ మీరూ శుభ్రంగా తినండి. పాపను నేను డ్రాప్ చేసి వెళతాను. సాయంత్రం మీరు తీసుకురండి". ఒప్పగింతలతో పాటు పాపను వెంటేసుకుని లిఫ్ట్‌లో నిలబడింది. ఇద్దరూ టాటా చెబుతుండగా లిఫ్ట్ కదిలింది. దేవతలు భూలోకానికి ప్రయాణమైనట్లు వాళ్ళు క్షణంలో కిందికి జారిపొయ్యారు. సంప్రదాయాలు, సెంటిమెంట్లు, పూర్తిగా చావని వాణ్ణేమో. 'ఇంటి దేవతలు' అని అనుకున్నాను.

అవునూ ఇవాళ ఏం చేయాలి? మనిషి విజయాల మీద లోతుగా స్టడీ చేయాలి. బాబును ఒక్కణ్ణే వదిలి ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు. పైగా నెట్ మీద కూర్చుని చేసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయి. మా వాడితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ ముగించాను.

స్టడీలో రిలాక్సయి, ఆఫీసర్ చెవుల్లోకి సెలవు మంత్రమూదగలిగే మహాద్భుతమైన పరికరం చేతిలో ఉందికదా? నెంబరు నొక్కాను. ఇది గళయంత్రం. ఎవరి నెంబరు నొక్కితే వారి గొంతు వినిపిస్తుంది. వినిపించకపోతే మెసేజ్ కూడా పంపొచ్చు. సరే - ఆఫీసు ఫార్మాలిటి పూర్తిచేశాను. గట్టిగా గాలి పీల్చి వదిలాను.

మనిషి ! మనిషి !! కూర్చోనివ్వడు. నిలబడనివ్వడు. వాడి అద్భుతమైన విజయాలు ఒకటా? రెండా? తవ్వాలి ! తవ్వి తీయాలి !!

విజ్ఞానపథంలో విజయఘట్టాలు.

అవును. మనిషి కథలో ఎన్నో మలుపులు. ఎన్నో విజయాలు. రాస్తూ కూచున్నాను.